సాక్షి వికారాబాద్

బుధవారం ı 6 ı డిసెంబర్ ı 2023



విజయ దుందుభి

వికారాబాద్ గడ్డ రేవంత్‌రెడ్డికి కలిసొచ్చిందా అంటే అవుననే చెప్పాలి. ఆయన చెప్పిన మాటే నెగ్గింది. 8లో▸



ఫలించని వ్యూహం

సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలో ప్రముఖులు ప్రచారం చేసినా ఓట్లు రాలలేదు. 8లో▸



ఆరుతడి పంటలపై ఆసక్తి

వరి తోపాటు ఆరుతడి పంటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో అన్నదాతలు ఆ దిశగా పయనిస్తున్నారు. 9లో▸

CM మన రేవంతన్న..

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఖరారు చేసిన అధిష్టానం



- సొంత నియోజకవర్గం కొడంగల్‌లో జోష్
- అత్తగారి ఊరు మాడ్గులలో హర్షాతిరేకాలు
- మనవాడే సీఎం అయ్యాడంటూ సంబరాలు

కొడంగల్/ఆమనగల్లు: తెలంగాణ కొత్త ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన సీఎం పీఠం అధిరోహించనుండడంతో స్థానికంగా పార్టీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్రాన్ని పాలించేది 'మనవాడే' అంటూ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి.. మిఠాయిలు పంచుకుని జోష్‌లో మునిగిపోయారు. పీసీసీ అధ్యక్షుడిగా ఒంటి చెత్తో పార్టీని విజయతీరాలకు చేర్చిన రేవంత్‌రెడ్డి అధికార పీఠాన్ని 'చే'జిక్కించుకోగలిగారు. దీంతో తెలంగాణవ్యాప్తంగా కొడంగల్ పేరు మరోసారి మార్మోగింది. పోలింగ్ ముగిసి.. కౌంటింగ్ జరిగిన రోజు నుంచి ఎక్కడ చూసినా రేవంత్‌పైనే చర్చ. కాస్త ఉత్కంఠ రేకెత్తించినప్పటికీ అనుకున్నట్టుగానే ముఖ్యమంత్రి పదవి వరించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



బొంరాస్‌పేటలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

కొడంగల్‌లో భారీ మెజారిటీ

కొడంగల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి రేవంత్ భారీ మెజారిటీతో గెలిచి చరిత్ర సృష్టించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నందనం వెంకటయ్యపై కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన గురునాథ్‌రెడ్డి 20,585 ఓట్లు సాధించారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్ 32,532 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి రికార్డు సృష్టించారు.

అభిమానుల సంబరాలు

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిపేరును అధిష్టానం ప్రకటించగానే వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి చేసిన కృషిని అధిష్టానం గుర్తించిందని.. తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడిగా ఎదిగిన ఆయనను వారి ఆకాంక్షల మేరకు సీఎంగా ప్రకటించిందని పలువురు నాయకులు మాట్లాడారు. రేవంత్ ఆధ్వర్యంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.



కడ్తాల్: టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు



కొడంగల్‌లో టపాసులు కాల్చుతున్న కాంగ్రెస్ నేతలు

మాడ్గుల అల్లుడే..

సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో ఆయన అత్తగారి ఊరైన మాడ్గులలో సంబరాలు మిన్నంటాయి. మాడ్గులతో రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి వివాహం దివంగత కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి సోదరుడు పద్మారెడ్డి కూతురితో జరిగింది. మాడ్గులకు చెందిన పద్మారెడ్డికి స్వగ్రామంలో ఇళ్లు ఉంది. తరచూ అత్తగారి ఊరికి రేవంత్‌రెడ్డి వచ్చివెళ్లేవారు. రాజకీయ నేపథ్యం ఉన్న ఇంటికి అల్లుడైన రేవంత్‌రెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించిన కొన్నేళ్లలోనే సీఎం కావడం విశేషం. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రకటించడంతో మాడ్గులవాసులు 'మా ఊరి అల్లుడు సీఎం' అవుతున్నాడంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాడు మామ వద్దనుకున్నాడు.. నేడు అల్లుడు అయ్యాడు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి పదవిని మాడ్గులకు చెందిన జైపాల్‌రెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం ప్రతిపాదన చేసినప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించారు. జైపాల్‌రెడ్డి కుటుంబానికి అవకాశం వచ్చినా కాదనుకున్నప్పటికీ ఇప్పుడు అదే ఇంటికి అల్లుడైన రేవంత్‌రెడ్డి సీఎం అవుతున్నారు.

అభివృద్ధిపై ఎన్నో ఆశలు

ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుకుంటున్నారు. స్వగ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు అత్తగారి ఊరైన మాడ్గులను అభివృద్ధి చేయాలని ఆశిస్తున్నారు.



మాడ్గులలో జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణలో రేవంత్‌రెడ్డి (ఫైల్)

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్న నేపథ్యంలో మంగళవారం వికారాబాద్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకుంటామని మేనిఫెస్టోలో పొందుపరిచారని పేర్కొన్నారు. అలాగే కార్మికులకు రావాల్సిన బకాయిలు, 2017, 2021 సంబంధించి వేతన సవరణ బిల్లులు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం పదవి చేపట్టనున్న రేవంత్‌రెడ్డికి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబుకు, వైస్ చైర్మన్ ప్రసాద్‌కుమార్‌కు వికారాబాద్ డిపో కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ జేఏసీ కన్వీనర్, టీజేఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కావలి హన్మంతు ముదిరాజ్, డిపో ఉద్యోగులు గోపాల్, రుక్మయ్య, అశోక్, వసంత్ గౌడ్, వెంకటేష్, దయాకర్, మనోహర్, ఎల్లయ్య, రవి, అంజయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్ కొత్త ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా బాబా దీవెనలతో షాద్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని ఇటీవల గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన దర్గాను దర్శించుకుని మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలేంటో తనకు తెలుసని, పూర్తిస్థాయి ప్రభుత్వం ఏర్పాటు కాగానే అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికలకు ముందు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన విజయం సాధించిన తర్వాత దేవాలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలువురు కార్యకర్తలు ఉన్నారు.

ఘన నివాళి



పాండురంగారెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సైబరాబాద్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న కే పాండురంగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డి ఏసీపీ స్వగ్రామం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గుడుపల్లికి వెళ్లి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రెండో పెళ్లికి అడ్డుగా ఉందని..

భార్య గొంతు నులిమి చంపిన భర్త

తాండూరు: రెండో పెళ్లికి అడ్డుగా ఉందని కట్టుకున్న భార్యను కడతేర్చిన ఘటన తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరులోని సీతారాంపేట్‌కు చెందిన అనసూయ(30)కు అదే ప్రాంతానికి చెందిన మ్యాతరి శాంత్‌కుమార్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నలుగురు మగపిల్లలు పుట్టి చనిపోయారు. దీంతో శాంత్ కుమార్ తాగుడుకు బానిసయ్యాడు. చిన్నచిన్న విషయాలకు భార్యతో గొడవ పడేవాడు. సోమవారం సాయంత్రం పూటుగా తాగి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవ పడి ఇష్టం వచ్చినట్లు చితకబాదాడు. అనంతరం గొంతు నులిమి చంపాడు. ఈ విషయమై మృతురాలి సోదరుడు శ్రీనివాస్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతర ప్రారంభం

101వ మెథడిస్టు క్రిస్టియన్ ఉత్సవాలను ప్రారంభించిన బిషప్‌లు



ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరను ప్రారంభిస్తున్న బిషప్‌లు ఎంఏ డ్యానియల్, ఎస్ఎల్ కర్‌కరే



ప్రార్థన చేస్తున్న బిషప్‌లు

ధారూరు: నూటొక్క (101) వసంతాలకు చేరిన ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరను మంగళవారం బిషప్ ఎంఏ డ్యానియల్, ఆశా డానియల్, బిషప్ ఎస్ఎల్ కర్‌కరే ఆయన భార్య కమల్ కర్‌కరేలు ప్రారంభించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ, పాటలు పాడుతూ ప్రధాన శిలువ వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. వారికి జాతర కార్యదర్శి దయానంద్, జాతీయ లే లీడర్ ఇమానియల్ స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో బిషప్‌లు ఎంఏ డ్యానియల్, ఎస్ఎల్ కర్‌కరే మాట్లాడారు. ప్రతి ఏటా నవంబర్ మాసంలో జాతర నిర్వహించే వారమని, ఎన్నికల నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఇవ్వడం సాధ్యం కాదని ఉన్నతాధికారులు చెప్పడంతో డిసెంబర్ నెలకు మార్చడం జరిగిందని తెలిపారు.

ఏసును నమ్మితే అంతా మంచే..

ఏసుక్రీస్తును మనసా, వాచా నమ్మి ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి దయానంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లే లీడర్ ఇమానియల్, రెవరెన్ మార్క్ డీఎస్, ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధికారులు, కాన్ఫరెన్ లే లీడర్లు, కాన్ఫరెన్స్ కోశాధికారులు, పాస్టర్లు, యాత్రికులు పాల్గొన్నారు. మొదటి రోజు మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నారు. మొదటి రోజు దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన పాస్టర్లు జాతరకు హాజరయ్యారు. పాస్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసు పట్ల దైవభక్తి కలిగేలా చేయాలని జాతర కార్యదర్శి దయానంద్, రెవరెన్ మార్క్ డీఎస్‌లు సూచించారు. జాతరలో దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆర్కెస్ట్రా బృందం ఏసుక్రీస్తును స్తుతిస్తూ భక్తి పాటలు పాడారు.

ప్రాణం ఉన్నంత వరకు..



విలేకరులతో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

- తాండూరులోనే ఉంటా
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: నేను ఇక్కడి వాడిని.. ప్రాణం ఉన్నంత వరకు తాండూరులోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మంగళవారం మొదటి సారి తాండూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను కలిసేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. పలువురు రోహిత్‌రెడ్డిని చూసి కంటతడి పెట్టారు. దీంతో పైలెట్ వారిని ఓదార్చారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని పేర్కొన్నారు. మళ్లీ మనమే అంటూ ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. 78వేల మంది తనకు ఓటేసి అండగా నిలిచి ఆశీర్వదించారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరునా శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తాండూరు నియోజకవర్గంలో తాను ప్రారంభించిన అభివృద్ధి యజ్ఞాన్ని పూర్తి చేయాలని ప్రస్తుత ఎమ్మెల్యేను కోరుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు నయీం, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ధాన్యం సేకరణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నాలుగు ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు
- జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 1.33లక్షల ఎకరాలు
- 3.47లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

వికారాబాద్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే దోమ మండల కేంద్రంలో ఒక కేంద్రాన్ని ప్రారంభించగా బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. గత ఏడాది నవంబర్ మాసంలోనే పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో కాస్త ఆలస్యం అయ్యింది. ప్రస్తుతం రైతులు సైతం కోతలను ముమ్మరం చేశారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి సాగైన నేపథ్యంలో అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మద్దతు ధర రూ. 2,203

క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2203 మద్దతు ధర ప్రకటించింది. సాధారణ రకానికి రూ. 2183 చెల్లించనున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు అదనంగా క్వింటాలకు రూ. 500 ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇవ్వగా వారే అధికారంలోకి వచ్చారు. ఈ హామీ ఈ సీజన్ నుంచే అమలు చేస్తారా..? లేక వచ్చే రబీ సీజన్ నుంచి అమలు చేస్తారా.? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది 3.47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 3.29 లక్షల మెట్రిక్ టన్నులు రావచ్చని వారు అంచనా వేస్తున్నారు.

122 కొనుగోలు కేంద్రాలు

యాసంగి సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సారి కొనుగోలు కేంద్రాల సంఖ్యను తగ్గించారు. ఈ ఏడాది 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది 1.33లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఎకరాకు సగటున 26 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 3.47లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. అయితే ఇందులో సీడ్, తినేందుకు, ఇతర చోట్ల విక్రయాలు పోను కొనుగోలు కేంద్రాలకు 2.29 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని 70 మిల్లర్ల ద్వారా మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ధాన్యం నిల్వ కోసం ఇప్పటికే స్థలాలు, మిల్లులు గుర్తిస్తున్నారు. 35 లక్షల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో 3,200 టార్పాలిన్లు సిద్ధం చేశారు. 355 వేయింగ్ మిషన్లు, 258 మాశ్చర్ మీటర్లు, 69 ప్యాడీ క్లీనర్లను కేంద్రాల దగ్గర సిద్ధంగా ఉంచారు.



రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు: కలెక్టర్



వికారాబాద్ అర్బన్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సకాలంలో వరి ధాన్యం సేకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ధాన్యం సేకరణపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 122 కొనుగోలు కేంద్రాలను ప్రారంభం కావాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో అవసరం మేరకు గన్నీ బ్యాగులు, కాంటాలు, తేమ శాతం పరిశీలించే యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైసు మిల్లులకు తరలించాలన్నారు. అలాగే వడ్ల నిల్వ కోసం పరిగి, తాండూరు, కొడంగల్‌లో గోదాంలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు పూర్తయినందున ప్రజాప్రతినిధులకు పూర్తి సమాచారం ఇచ్చి వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలన్నారు. మిల్లుల వద్ద హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు టోకెన్లు ఇచ్చి వరుస క్రమంలో ధాన్యం సేకరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, డీఆర్‌డీఓ కృష్ణన్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి శంకరాచారి, మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిపుణుల సలహాలతో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్‌ మాధవి



రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మొయినాబాద్‌రూరల్‌: రైతులు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు అధికారుల సలహాలు పాటించాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ ఏ.మాధవి సూచించారు. మంగళవారం మండలంలోని నక్కలపల్లిలో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నెల రోజుల క్రితం గ్రామంలో దాదాపు 50 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు పరీక్షించారు. దీనికి సంబంధించి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ఏ.మాధవి మాట్లాడుతూ.. రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. దీంతో ఆర్థిక తోడ్పాటు లభిస్తుందన్నారు. మేలైన వంగడాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు దామోదర్‌రాజు, నవీన్‌చంద్రారెడ్డి, రాజేశ్వర్‌నాయక్‌, శ్రావణ్‌ కుమార్‌, రామకృష్ణాబాబు, రైతులు అంజయ్యగౌడ్‌, ఉపసర్పంచ్‌ రాజు, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటయ్య, నర్సింహులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్‌ బంక్‌లను పక్కాగా నిర్వహించాలి

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు
- డీటీ మాచన రఘునందన్‌



ఆమనగల్లు పెట్రోలు బంక్‌లో రిజిస్టర్‌ తనిఖీ చేస్తున్న డీటీ రఘునందన్‌

ఆమనగల్లు: పెట్రోలు బంక్‌లను డీలర్లు జవాబుదారీతనంతో నిర్వహించాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ మాచన రఘునందన్‌ అన్నారు. పెట్రోలు బంక్‌లను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న పలు పెట్రోలు బంక్‌లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా బంక్‌ల్లో స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. బంక్‌ల వద్దకు వచ్చిన వాహనదారులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని పెట్రోలు బంక్‌లను ఆయా యాజమాన్యాలు సరిగా నిర్వహించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. బంక్‌ల్లో సంబంధిత డీలర్లు అందుబాటులో ఉండాలని, వినియోగదారుల సందేహాలకు సమాధానం చెప్పాలని సూచించారు. బంక్‌ల్లో పనిచేస్తున్న వారు వినియోగదారులతో సక్రమంగా వ్యవహరించాలన్నారు. స్టాకు లేదని ఫిర్యాదులు రాకుండా చూడాలని డీటీ సూచించారు.

వికారాబాద్‌ నుంచే విజయ దుందుభి

- అక్టోబర్‌ 16న చిగుళ్లపల్లి బహిరంగ సభ నుంచి కేసీఆర్‌కు సవాల్‌
- రేవంత్‌రెడ్డికి అండగా నిలిచిన ఓటర్లు
- నాలుగు సెగ్మెంట్‌లు హస్తం కైవసం



వికారాబాద్‌ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి, చిత్రంలో ప్రసాద్‌కుమార్‌, అనన్య, ఏసీఆర్‌ (ఫైల్‌)

అనంతగిరి: వికారాబాద్‌ గడ్డ రేవంత్‌రెడ్డికి కలిసొచ్చిందా అంటే అవుననే చెప్పాలి. ఆయన చెప్పిన మాటనే నెగ్గింది. కాంగ్రెస్‌ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఆయన వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి కాబోతున్నాడు. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో అక్టోబర్‌ 16న బీఆర్‌ఎస్‌ నుంచి హస్తం పార్టీలో చేరుతున్న ముఖ్యనేతల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. నాడు ఆయన సమక్షంలో భారీగా కారు దిగి కాంగ్రెస్‌ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారాన్ని నా మిత్రుడు ప్రసాద్‌కుమార్‌ విజయం కోసం వికారాబాద్‌ నుంచే ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. ఇక్కడ నుంచే కేసీఆర్‌కు సవాల్‌ విసురుతూ హుస్నాబాద్‌ నీకు కలిసి వస్తుందా..? వికారాబాద్‌ నాకు కలిసి వస్తుందా డిసెంబర్‌ 3న చూసుకుందన్నామన్నారు. కాగా రేవంత్‌రెడ్డి నాడు చెప్పిన వికారాబాద్‌ సభ మాటనే ఆయనకు సెంటిమెంట్‌గా కలిసివచ్చిందని చెప్పొచ్చు. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజానీకం ఆయనకు అండగా నిలబడింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికల ఫలితాల్లో జిల్లాలోని వికారాబాద్‌, పరిగి, తాండూరు, కొడంగల్‌ అన్ని సెగ్మెంట్‌లలోనూ కాంగ్రెస్‌ జెండానే రెపరెపలాడింది. 1978, 1989లో జిల్లాకు చెందిన మర్రి చెన్నారెడ్డి రెండు పర్యాయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. తెలంగాణలో మొదటి సారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కొడంగల్‌ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం పదవి వరించడం జిల్లాకే గర్వకారణం. ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్‌ సైతం వికారాబాద్‌ అసెంబ్లీ ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. నేటి ఫలితాల్లోనూ అదే నిజమైంది. ఇక్కడ హస్తం గుర్తుపై పోటీచేసిన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌ కుమార్‌ విజయం సాధించగా.. రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌ పార్టీయే అధికారంలోకి వచ్చిందని జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

నామినేటెడ్‌ పదవులకు రాజీనామా

కొడంగల్‌: నియోజకవర్గంలోని పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు తమ నామినేటెడ్‌ పదవులకు రాజీనామాలు చేశారు. మంగళవారం స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సలీం, కొడంగల్‌ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ సుజాత, వైస్‌ చైర్‌పర్సన్‌ వాణిశ్రీ తమ పదవులకు సంబంధించిన రాజీనామా పత్రాలను మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి సమర్పించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.



రాజీనామా పత్రం అందజేస్తున్న ఏఎంసీ వైస్‌ చైర్‌పర్సన్‌ వాణిశ్రీ

కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: ఓడినా.. గెలిచినా.. తాను నిత్యం ప్రజాసేవలోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. ప్రజలు మార్పు కోరుకోవంతోనే కాంగ్రెస్‌ పార్టీ విజయం సాధించిందన్నారు. కొడంగల్‌కు ముఖ్యమంత్రి పదవి వచ్చినా సంతోషిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ బీఆర్‌ఎస్‌ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల్లో రాజకీయాలు చేయడం తప్పనిసరని, ఎన్నికలు ముగిశాక అభివృద్ధిపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల బొంరాస్‌పేట, మద్దూరు మండలాల్లో బీఆర్‌ఎస్‌ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని.. ఇది సరికాదని హితవు పలికారు. కార్యకర్తలపై దాడులకు పాల్పడితే సహించేదిలేదని కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని అన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు కత్తజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు మధుసూదన్‌ రావ్‌ యాదవ్‌, వాణిశ్రీ, దామోదర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ముదిగండ్ల కృష్ణ, అంజద్‌, చాంద్‌పాషా, కోట్ల యాదగిరి, నరోత్తంరెడ్డి, రమేష్‌బాబు, సలీమ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫలించని ప్రముఖుల వ్యూహం



కొడంగల్‌లో కేటీఆర్‌ రోడ్డు షో (ఫైల్‌)

దౌల్తాబాద్‌: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్‌ నియోజకవర్గంలో ప్రముఖులు ప్రచారం చేసినా ఓట్లు రాలలేదు. మంత్రుల ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకోలేకపోయాయి. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారు చేసిన ప్రయత్నం ఫలించలేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. బీఆర్‌ఎస్‌ కొడంగల్‌ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున కొడంగల్‌లో కేటీఆర్‌ ప్రచారం చేశారు. కోస్గి పట్టణంలో పార్టీ అధినేత, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ బహిరంగ సభ నిర్వహించారు. ప్రచారం ముగింపు రోజు అప్పటి మంత్రి హరీశ్‌రావు మద్దూరులో రోడ్డు షో నిర్వహించారు. పార్టీ స్టార్‌ క్యాంపెయినర్లుగా పేరున్న వీరిద్దరు నరేందర్‌రెడ్డి గెలుపు కోసం శ్రమించినా ఓట్లు రాబట్టలేక పోయారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఎన్నికలకు రెండు నెలల ముందుగానే కేసీఆర్‌ అభ్యర్థులను ప్రకటించారు. అప్పటి నుంచి నరేందర్‌రెడ్డి నిత్యం గ్రామగ్రామన ప్రచారం చేశారు. ఇలా ఇంతమంది ఇన్ని రకాలుగా చెమటోడ్చినా ఫలితాలు అనుకూలించలేదని, దీనికి కారణం నాటి సర్కార్‌పై ఉన్న వ్యతిరేకతే అని పేర్కొన్నారు.

మంత్రులు పర్యటించినా విఫలం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

శంకర్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ కుటుంబం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. ఆమె నివాసానికి మంగళవారం శంకర్‌పల్లి మండల బీఆర్‌ఎస్‌ నాయకులు పెద్ద ఎత్తున వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు ఎప్పుడూ తన వంతు కృషి చేస్తానని అన్నారు. అధికారంతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌, బాలకృష్ణ, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంతో అన్నదాత ఆగం

- కాలి బూడిదైన పత్తి, ఇల్లు
- రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం



దగ్ధమైన ఇల్లు

తాండూరు రూరల్‌: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట కళ్లముందే అగ్నికి అహుతయింది. ఈ దుర్ఘటన మండల పరిధిలోని పర్వాతపూర్‌లో చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ధనసిరి వెంకట్‌రెడ్డి తన సాగుచేసిన 20 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోని ఓ గదిలో డంప్‌ చేసి ఉంచాడు. సోమవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ప్రమాదవశాత్తు పత్తి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఇంటి పక్కన ఉన్న ఓ వృద్ధురాలు గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. స్పందించిన కాలనీవాసులు నీళ్లతో మంటలను ఆర్పేప్రయత్నం చేశారు. అనంతరం ఫైరింజన్‌ సాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. కాగా రూ.1.50లక్ష విలువైన పత్తితో పాటు రూ.1.50లక్షల ఇల్లు దగ్ధమైందని బాధితుడు వెంకట్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచు లాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

లేగదూడలపై హైనా దాడి

అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల సూచన



హైనాలో దాడిలో గాయపడిన లేగదూడ



ఘటనాస్థలిలో గుర్తించిన పాదముద్రలు

కొత్తూరు: కొత్తూరు పట్టణ సమీపంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద లేగదూడలపై మంగళవారం ఓ అడవి జంతువు దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేగింది. దీంతో స్థానిక పోలీసులతో పాటు అటవీశాఖ అధికారులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. వివరాల్లోకెళితే.. పట్టణంలో నివాసం ఉంటున్న నిర్మలమ్మకు కొత్తూరుతండా సమీపంలో పొలం ఉంది. ఆమె అక్కడ పాడి పరిశ్రమను నిర్వహిస్తుంది. పాకలో ఆవులు, లేగదూడలను కట్టేసి మంగళవారం ఉదయం పాలు తీసేందుకు వచ్చింది. అక్కడకు రాగానే రెండు లేగదూడలు విగతజీవులుగా ఉండడంతో భయంతో స్థానికులకు సమాచారం ఇవ్వగా, దాడి చేసింది చిరుతపులిగా అనుమానించారు. అధికారులు చేరుకొని దూడలపై దాడి చేసిన తీరును పరిశీలించారు. పాదముద్రలను బట్టి చంపింది చిరుతపులి కాదని, హైనా అయ్యుండొచ్చని చెప్పారు. చిరుత దాడి చేస్తే మెడ, శరీరంపై గోర్ల గుర్తులు ఉంటాయన్నారు. పాదముద్రలను బట్టి రెండు హైనాలు దాడిలో ఉన్నట్లు తెలిపారు. సమీప పొలాల్లోని రైతులు కొన్ని రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్‌ సెక్షన్‌ అధికారి రవీందర్‌, బీట్‌ అధికారి అజీజ్‌లు తెలిపారు.

ప్రజాస్వామ్యమే గెలిచింది



మిఠాయి తినిపించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ మజ్దూర్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌

పరిగి: నియంత పాలన అంతమై ప్రజాస్వామ్యమే గెలిచిందని ఆర్టీసీ మజ్దూర్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌ అన్నారు. కాంగ్రెస్‌ విజయం సాధించడంపై మంగళవారం పట్టణ కేంద్రంలోని డిపో ఎదుట టపాసులు కాల్చి స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. అనంతరం హన్మంతు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ విజయాన్ని ఆర్టీసీ విజయంగా భావిస్తున్నామన్నారు. కేసీఆర్‌ పాలనలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఎన్నో విధాలుగా ఇబ్బంది పడ్డారన్నారు. ఉద్యోగులను చిన్నచూపు చూసిన ఏ పార్టీకి అధికారం ఉండదని చెప్పడానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్‌ పాలనలో యూనియన్లను రద్దు చేసి మా హక్కులను కాలరాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న పార్టీ శ్రేణులు

పరిగిలో కాంగ్రెస్‌ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి గెలుపొందడంతో పట్టణ కేంద్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో యువజన కాంగ్రెస్‌ నాయకులు వంద కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థసారథి పంతులు, రామకృష్ణారెడ్డి, పాలాద్రి శ్రీనివాస్‌, వెంకట్‌ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

షాద్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

షాద్‌నగర్‌: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్‌ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఇచ్చే తీర్పును అందరు గౌరవించాల్సిందేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో తన గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎంతో కష్టపడి పని చేశారని.. ఓడిపోయినంత మాత్రాన అధైర్యపడవద్దని సూచించారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ కొందూటి నరేందర్‌, వైస్‌ చైర్మన్‌ ఎంఎస్‌ నటరాజన్‌, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జోరు తగ్గిన 'కారు'

- 33,532 నుంచి 268కి పడిపోయిన ఆధిక్యం
- సొంత మండలం, స్వగ్రామంలో మెజార్టీతో హ్యాట్రిక్‌ సాధించిన కాలె యాదయ్య



శంకర్‌పల్లి: ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న మిర్జాగూడ నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ నుంచి కారు జోరు తగ్గింది. గత ఎన్నికల్లో 33వేల పై చిలుకు ఓట్లు సాధించిన టీఆర్‌ఎస్‌.. ఈ ఎన్నికల్లో కేవలం 268 ఓటకు పడిపోయింది. ఈ సెగ్మెంట్‌ నుంచి పోటీ చేసిన 12 మంది అభ్యర్థులలో స్వగ్రామంలో పట్టు సాధించిన కాలె యాదయ్యను విజయం వరించింది. దీంతో మూడవ సారి విజయంతో హ్యాట్రిక్‌ సాధించాడు. అదే కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌కు తృటిలో విజయాన్ని దూరం చేసిందని చెప్పాల్సిందే. కాలె యాదయ్య స్వగ్రామంలో సాధించిన మెజార్టీ 346 ఓట్లు అయితే కాంగ్రెస్‌ అభ్యర్థి సాధించిన ఓట్లు కేవలం 67 మాత్రమే కావటంతో కాంగ్రెస్‌ అభ్యర్థికి అదే మెజార్టీ ఎక్కువగా వచ్చి ఉంటే గెలుపు కాంగ్రెస్‌కి దక్కేది విశ్లేషకులు అభిప్రాయం. ఇక మిగత 10 మంది అభ్యర్థులైతే స్వగ్రామంలోనే వెనకంజలో ఉండిపోయారు. బీజేపీ అభ్యర్థి కేఎస్‌ రత్నం మినహా ఏ అభ్యర్థికి వారి స్వగ్రామంలో కనీస ఓట్లు కూడా రాలేదు.

సొంత గ్రామాల్లో పోలైన ఓట్లు

చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసిన కాలె యాదయ్యది వికారాబాద్‌ జిల్లా నవాబుపేట మండలం చించల్‌పేట. ఇక్కడ మూడు పోలింగ్‌ బూత్‌లలో 2,368 ఓటర్లున్నారు. 1595 మంది తమ ఓటుహక్కు వినియోగించుకోగా 944 మంది ఓటర్లు కారు గుర్తుకు ఓటేసి యాదయ్యను దీవించారు. ఇక్కడ కాంగ్రెస్‌ అభ్యర్థికి 316, బీజేపీ అభ్యర్థికి 282, నోటాకు 19 మంది ఓటేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు 59 శాతం మెజార్టీ వచ్చింది.

స్వగ్రామంలో స్వల్ప మెజారిటీ

ఇక కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌ షాబాద్‌ మండలంలోని నార్లెగూడ. కుమ్మరిగూడలోని రెండు పోలింగ్‌ బూత్‌లలో ఈ గ్రామానికి సంబంధించిన ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 1,948 ఓట్లు ఉండగా 1,439 పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌కు 634 ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌కు 567, బీజేపీకి 168 పోలయ్యాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు స్వల్పంగా 67 ఓట్లు మెజార్టీ వచ్చింది. స్వగ్రామంలో తగ్గిన మెజార్టీతో కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు. ఇక బీజేపీ అభ్యర్థి కెఎస్‌ రత్నం సొంత గ్రామమైన మొయినాబాద్‌ మండలంలోని కేతిరెడ్డిపల్లిలోనూ ఆయనకు 248 ఓట్లు మైనస్‌లో ఉన్నాయి. కాంగ్రెస్‌ అభ్యర్థి కంటే తక్కువగా ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లు 1,912 ఉంటే 1,490 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీ అభ్యర్థి రత్నంకు 330 ఓట్లు వస్తే కాంగ్రెస్‌కు 578, బీఆర్‌ఎస్‌కు 555ఓట్లు వచ్చాయి. దీంతోఆయన మూడవస్థానానికే పరిమితమయ్యాడు.

పార్టీ	పోలైన ఓట్లు
కాంగ్రెస్‌	969
బీఆర్‌ఎస్‌	375
బీజేపీ	569
బీఎస్పీ	33
నోటా	11

ఆధిక్యమిచ్చిన మండలాలు

నియోజకవర్గంలోని ఐదు మండలకేంద్రాల్లో మూడు కాంగ్రెస్‌కు రెండు బీఆర్‌ఎస్‌కు ఆధిక్యం ఇచ్చాయి. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కాలె యాదయ్య సొంత మండలం నవాబుపేట మండలకేంద్రంలో కాంగ్రెస్‌కు 81ఓట్లు ఎక్కువగా వచ్చాయి. చేవెళ్ల మండలకేంద్రంలో కాంగ్రెస్‌కు 856 ఓట్లు ఆధిక్యం లభించింది. షాబాద్‌ మండల కేంద్రంలో 296 ఓట్లు కాంగ్రెస్‌కు మెజార్టీ ఇచ్చాయి. మొయినాబాద్‌ మండలకేంద్రంలో 124 ఓట్లు బీఆర్‌ఎస్‌కు శంకర్‌పల్లి మండలకేంద్రంలో 334 ఓట్లు కారు మెజార్టీ వచ్చింది. మండలం మొత్తంగా చూసుకుంటే నవాబుపేట, శంకర్‌పల్లి మండలాలు బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఇస్తే చేవెళ్ల, షాబాద్‌, మొయినాబాద్‌ మండలాలు హస్తానికి ఆధిక్యమిచ్చాయి. కాంగ్రెస్‌కే ఎక్కువగా మండలాలు మొగ్గు చూపిన యాదయ్య సొంత గ్రామం, శంకర్‌పల్లి మండలం ఇచ్చిన మెజార్టీ ఎక్కువగా ఉండటంతో స్వల్ప మెజార్టీతో యాదయ్య విజయ సాధించారు.

ధరావతు కోల్పోయిన తొమ్మిది మంది అభ్యర్థులు

చేవెళ్ల అసెంబ్లీ నుంచి పోటీ చేసిన 12 మంది అభ్యర్థులలో ప్రధాన పార్టీలకు చెందిన బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ అభ్యర్థులను మినహాయిస్తే 9మంది అభ్యర్థులకు డిపాజిట్లు దక్కలేదు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థికి 76,218ఓట్లు, కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌కు 75,950 ఓట్లు, బీజేపీ అభ్యర్థి రత్నంకు 37,763 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు ధరావతు కోల్పోయారు. బీఎస్పీ నుంచి పోటీ చేసిన రాజామహేంద్ర వర్మకు కేవలం 1,720 ఓట్లు, ప్రజా వెలుగు పార్టీ నుంచి పోటీచేసిన దుర్గాప్రసాద్‌కు 871 ఓట్లు, స్వతంత్ర్య అభ్యర్థి తుదు పాండుకు రోడ్డు రోలర్‌ గుర్తు రావటంతో 757 ఓట్లు, మరో స్వతంత్ర అభ్యర్థి మద్దెల సత్యనారాయణకు 444ఓట్లు, బైండ్ల నర్సింలుకు 383ఓట్లు, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థి మేకల శ్రీనివాస్‌కు 147, గణ సురక్ష పార్టీ అభ్యర్థి చిన్న మాణిక్యంకు 129ఓట్లు, ఎంబీటీ నుంచి పోటీ చేసిన కిరణ్‌కుమార్‌కు 116ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో పోటీచేసిన 8 మంది అభ్యర్థులకంటే ఎక్కువగా నోటాకు 1,423 ఓట్లు రావటం గమనర్హం.